పోలీసుల సంక్షేమానికి మరో అడుగు

- జిల్లాలో నూతన పోలీసు భవనాల ప్రారంభం
- ఆధునిక వసతులతో కూడిన నూతన పోలీసు భవనాలను ప్రారంభించిన రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తన పర్యటనలో భాగంగా ఎల్లపల్లి వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది కోసం నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించారు. పోలీస్ సిబ్బందికి మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ నిర్మాణాలు, భవిష్యత్‌లో నిర్మల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయనున్నారు. అనంతరం నూతన జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ఈ ఆధునిక భవనాలు పోలీస్ సిబ్బందికి మెరుగైన పని స్థలం, నివాస వాతావరణం అందించడమే కాకుండా జిల్లాలో సేవల నాణ్యతను పెంచేందుకు దోహదపడతాయన్నారు. నిర్మల్ పోలీసింగ్ రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని, ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.


పోలీసు భవనాలను ప్రారంభిస్తున్న డీజీపీ శివధర్ రెడ్డి

రెండో రోజు

నామినేషన్ల పర్వం

- సర్పంచ్‌లకు 19 నామినేషన్లు, వార్డులకు 92

ముథోల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని ఆయా జీపీలకు రెండో రోజు నామినేషన్లు పెరిగాయి. మొదటి రోజు మంద కోడిగా జరిగిన నామినేషన్ల పర్వం గురువారం ఊపందుకుంది. 5 క్లస్టర్లలో మొత్తం రెండవ రోజు సర్పంచ్‌లకు 19 నామినేషన్లు, వార్డులకు 92 నామినేషన్లు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. చివరి రోజైన శుక్రవారం మరింత నామినేషన్లు పెరగనున్నాయి.


ముథోల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఊపందుకున్న పంచాయతీ సం'గ్రామం'

- తొలిసారి ఓటు హక్కు పొందిన యువతలో ఉత్సాహం

ముథోల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో రాజకీయ జోష్ నెలకొంది. ముఖ్యంగా ఈసారి మొదటి సారి ఓటు హక్కు పొందిన యువతలో సరి కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ప్రజా స్వామ్య వ్యవస్థలో తమ ఓటు కీలకమన్న యువత ఎన్నికలపై చర్చల్లో భాగమవుతున్నారు. గ్రామాభివృద్ధికి తమ ఓటు తోడ్పడాలని భావిస్తున్నారు.

యువత ఓటు కీలకమే..

పంచాయతీ ఎన్నికల్లో యువ ఓటర్ల ఉత్సాహం అభ్యర్థులకు కొత్త సవాల్‌గా మారింది. గ్రామాభివృద్ధి, పారదర్శకత, సమస్యల పరిష్కారం వంటి అంశాలు యువత ప్రాధాన్యంగా చూస్తుండటంతో అభ్యర్థులు కూడా తమ ఎన్నికల వ్యూహాలను మార్చుకుంటున్నారు. గ్రామ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి తాము పొందిన ఈ తొలి ఓటులోనే ఉందని యువత చెబుతున్నారు. ఆంధ్రజ్యోతి పలువురి యువతను పలకరించినప్పుడు తమ అభిప్రాయాలు ఇలా తెలిపారు.

మనం గ్రామం కూడా మారాలి...



ఎన్నికలు రాజకీయ నాయకులకే కాకుండా మనకు సంబంధించినవే. ఈసారి గ్రామంలో అందరికి కష్ట సుఖాల్లో పాలు పంచుకునే నాయకుడికి, విశ్వాసం ఉంచి పని చేసే అభ్యర్థికి అవకాశం ఇవ్వాలి.

- దేవి వినయ్, డిగ్రీ విద్యార్థి

గ్రామాభివృద్ధిలో యువత పాత్ర పెరగాలి..



గ్రామంలో రోడ్లు, స్ట్రీట్ లైట్లు, నీటి పైపులు... చిన్న చిన్న సమస్యలు పరిష్కారమైతే గ్రామం మారిపోతుంది. ఈ సారి యువత ఓటు బలంగా వినిపించాలి. మొదటిసారి ఓటరు అవ్వడం ఎంతో గర్వంగా ఉంది.

- సట్ల సిద్ధు, డిగ్రీ విద్యార్థి

సరస్వతీ కాలువకు మహర్దశ



- రూ.70 కోట్లతో ప్రతిపాదనలు
- దెబ్బతిన్న లైనింగ్, కట్ట, స్ట్రక్చర్‌లు
- వర్షాకాలంలో గండ్లు
- కాలువ పొడువునా నిండిపోయిన పిచ్చి మొక్కలు
- నీటి సరఫరాకు ఆటంకాలు
- పనులు పూర్తయితే టేల్ ఎండ్ వరకు సాగునీరు

నిర్మల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంట పొలాలకు సాగు నీరందించే సరస్వతీ కాలువకు ఎట్టకేలకు మహర్దశ పట్టబోతోంది. చాలా ఏళ్ల నుంచి ఈ కాలువపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నాయి. దీని కారణంగా కాలువ కింద చివరి ఆయకట్టు వరకు సాగు నీరందని పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతి ఏటా కాలువకు గండ్లు పడడం, దెబ్బతిన్న లైనింగ్ కారణంగా ప్రాజెక్టు నుండి విడుదల చేసే నీరు ఈ కాలువ ద్వారా సక్రమంగా ప్రవహించకపోతుండడంతో పంట పొలాలకు సాగు నీరందని పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా యాసంగి సీజన్‌లో ఈ కాలువ ద్వారా సగం భూములకే సాగునీరందుతుండడంతో మిగతా సగం భూముల్లో సాగు చేసుకునే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే సరస్వతీ కాలువ ఆయకట్టు రైతులు ఈ కాలువకు మరమ్మతులు చేయించాలని ఏళ్ల నుంచి కోరుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సరస్వతీ కాలువను ఆధునీకరణ చేస్తామని ప్రకటించింది. పది ఏళ్లు దాటినా ఆ ప్రకటన ఆచరణకు నోచుకోలేదు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటికే కడెం ప్రాజెక్టుకు 11 కోట్ల రూపాయలను వ్యయం చేసింది. దీంతో పాటు మిగతా చెరువులు ఇతర కాలువల మరమ్మతులకు సైతం నిధులు విడుదల చేసింది. దీంతో ఇరిగేషన్ అధికారులు ఇక సరస్వతీ కాలువను కూడా ఆధునీకరించేందుకు ప్రతిపాదనలను రూపొందించారు.

సీఎం రేవంత్ పర్యటన పైనే ఆశలు

సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో త్వరలో జరపబోయే పర్యటనపై ఇరిగేషన్ అధికారులు, రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు. జిల్లాలో ఇటీవలే నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని ప్రారంభించేందుకు సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు కాంగ్రెస్ నేతలు, ఇరిగేషన్ అధికారులు సీఎం రేవంత్‌ను సదర్మాట్ బ్యారేజీ ప్రారంభానికి రావలసిందిగా ఆహ్వానించారు. అయితే సీఎం పర్యటనపై స్పష్టత వస్తుండడంతో ఇక్కడి ఇరిగేషన్ అధికారులు, రైతులు ఈ పర్యటనపై ఆశలు పెట్టుకుంటున్నారు. సీఎం రేవంత్ ఇక్కడి వేదిక పైనుంచే సరస్వతీ కాలువ ఆధునీకరణకు సంబంధించిన మంజూరు విషయమై ప్రకటించే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

70 కోట్లతో ప్రతిపాదనలు...

సరస్వతీ కాలువ ఆధునీకరణ పనుల కోసం ఇరిగేషన్ అధికారులు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసి నిధులు మంజూరు చేయగానే మార్చి మాసం నుంచి పనులు చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం కాలువ లైనింగ్‌తో పాటు చాలాచోట్ల కట్ట బలహీన పడింది. దీని కారణంగా వర్షాకాలంలో కాలువకు గండ్లు పడడం సహజంగా మారుతోంది. అలాగే కాలువ పొడవునా పిచ్చి మొక్కలు, బురద, మట్టి పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం అవుతుంది. దీని కారణంగా చివరి ఆయకట్టు వరకు సాగు నీరందని పరిస్థితి ఏర్పడుతోంది. ఆధునీకరణ పనులు చేపట్టినట్లయితే కాలువకు సంబంధించిన 112 స్ట్రక్చర్స్‌కు కూడా మరమ్మతులు జరగనున్నాయి. ఈ కాలువ ఆధునీకరణ పనులు పూర్తయితే టేలెండ్ వరకు పూర్తిస్థాయిలో ఖరీఫ్, రబీ సీజన్లకు సాగునీరు అందనుందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

ముథోల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లోని నామినేషన్ కేంద్రాన్ని అలాగే తరోడాలోని నామినేషన్ కేంద్రాన్ని గురువారం మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ రాథోడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న నామినేషన్ల పర్వాన్ని పరిశీలించి పలు వివరాలను క్లస్టర్‌లోని ఆర్వో, ఏఆర్వోలకు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తల భాగంగా పకడ్బందీగా కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈయన వెంట ఎంపీడీవో లవకుమార్, ఎంపీవో శివ కుమార్, సూపరింటెండెంట్ అశోక్ తదితరులున్నారు.


ముథోల్‌లో నామినేషన్ కేంద్రంలో వివరాలు అడుగుతున్న ప్రత్యేక అధికారి

ఘనంగా అయ్యప్ప పడిపూజ


కుంటాలలో అయ్యప్పకు అభిషేకం నిర్వహిస్తున్న స్వాములు

కుంటాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో గురువారం అయ్యప్పపడిపూజను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కుంటాలకు చెందిన రాథోడ్ ఆకాష్ గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ చంద్రమౌళి గురుస్వామి శిష్యుడు రేపల్లే వాస్తవ్యులు శివ శంకర్ రావు గురుస్వామి పాల్గొని అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వామి గణపతి విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు.

ఆర్జీయూకేటీలో కళా వైభవం

- రెండో రోజు కొనసాగిన స్పిక్ మైకే కార్యక్రమాలు

బాసర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలో జరుగుతున్న స్పిక్‌మెకే 4వ రాష్ట్ర కన్వెన్షన్ రెండో రోజు గురువారం కార్యక్రమాలు కళా సంస్కృతి సౌరభాలను వికసింపజేశాయి. జర్పా మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హత యోగ సెషన్ వాలంటీర్లకు శారీరక, మానసిక సమతుల్యతను అందించింది. తరువాత జరిగిన నాదయోగ సెషన్లు ఉదయాన్ని మరింత ఆధ్యాత్మిక మాధుర్యంతో నింపాయి. హిందుస్థానీ వోకల్‌లో కుమార్ మార్ధుర్, కర్ణాటక సంగీతంలో మండా సుధారాణి మార్గదర్శకత్వంలో విద్యార్థులు స్వరసౌందర్యాన్ని ఆస్వాదించారు. ప్రముఖ గురువుల పర్యావేక్షణలో పాల్గొన్న విద్యార్థులు తమ కాత్మక నైపుణ్యాలను మరింత మెరుగు పరుచుకున్నారు. మహిపాల్ బృందం అందించిన ఉత్సాహ భరిత ఒగ్గు డోలు ప్రదర్శన, తరువాత ఉమ మహేశ్వరి వినిపించిన హరికథ కార్యక్రమం తెలంగాణ సంప్రదాయ కళారుపాల వైభవాన్ని ప్రతిబింబించాయి. వివిధ కళల సమ్మేళనంగా సాగిన కార్యక్రమాలు వేదికలను సాంస్కృతిక రంగులతో అలంకరించాయి. కళ, సంప్రదాయం, ఆధ్యాత్మికతను సమన్వయ పరిచిన ఈ కార్యక్రమాలు పాల్గొన్న వారిని మంత్రముగ్ధుల్ని చేశాయి.


ఒగ్గుడోలు ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


కళాకారుల ప్రదర్శన

కాంగ్రెస్ రెండేళ్ల పాలన..

ప్రజా వంచనోత్సవాలు

- బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు అవుతాయని రైతులు, రైతు కూలీలు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, పెన్షన్ దారు లు వంటి వర్గాలన్నీ రెండేళ్లుగా ఆశగా చూస్తుంటే హామీలను అమలు చేయకుండా ప్రజా పాలన విజయోత్సవాలంటూ రేవంత్ రెడ్డి సంబరాలు చేసుకోవడం ఏమిటని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ఏ మొహం పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటన చేస్తే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుకూలుర ను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఏం సాధించిందని ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇచ్చిన మామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టినందుకు విజయోత్సవాలా... ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను నిలువెల్లా దగా చేసిన కాంగ్రెస్ సర్కారుకు విజయోత్సవాలు చేసుకునే అర్హత లేదన్నారు. ప్రజలను వంచించినందుకు సీఎం రేవంత్ రెడ్డి ముందుగా క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలన్నారు.

ఎందుకు ప్రజా విజయోత్సవాలు...

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో అభయ హస్తము పేరుతో ఆరు గ్యారంటీల కార్డును ప్రధాన హామీగా ఇవ్వడమే కాకుండా, కాంగ్రెస్ ముఖ్య నేతలంతా ఈ ఆరు గ్యారంటీలను బాండ్ పేపర్ల రూపంలో ప్రజలకు మాటిచ్చి ఎన్నికల్లో గెలిచి, పదవులు పొందాకా ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేసినందుకా అన్నారు.

ముగిసిన ఉత్సవాలు

- కల్లూరులో దత్త జయంతికి పోటెత్తిన భక్తజనం


సాయిబాబాకు అభిషేకం చేస్తున్న వేద పండితులు

కుంటాల, డిసెంబరు 4 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని దత్త వెంకట సాయి మందిరంలో దత్త జయంతి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. గత నవంబర్ 26 బుధ వారం రోజు ప్రారంభమైన ఉత్సవాలు నేటితో ముగిశాయి. ఆఖరి రోజైన గురువారం దత్త జయంతి ఉత్సవాలను ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం శ్రీ రుద్ర సహిత నవ చండి అనగాదేవి సహిత శ్రీ దత్తాత్రేయ మూల యంత్ర జ్ఞాన యాగం, పూర్ణాహుతి, చతుర్వేద పండితుల ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం దత్తాత్రేయ స్వామి జననం, డోలారోహణం, ఉపనయనం, భిక్షాటన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు దత్త జయంతి ఉత్సవాలకు కుంటాల మండలం నలుమూలల నుండే కాకుండా లోకేశ్వరం, దిలావర్‌పూర్, భైంసా తో పాటు మహారాష్ట్ర, హైదరాబాద్ నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్లూరు గ్రామ వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. దత్తాత్రేయ జననం కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. దత్తాత్రేయ జననం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కల్లూరు వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు క్యూలైన్‌లో భక్తులకు సేవలందించారు. అంతేగాకుండా వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో భక్తులకు శుద్ద జలాన్ని ఉచితంగా అందజేశారు. సాయంత్రం దత్తాత్రేయ స్వామి పాదుకల దర్శనం, పల్లకి సేవ, శోభాయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ శోభాయాత్రలో గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులతో హాజరయ్యారు. యువకులు నృత్యాలతో కల్లూరు గ్రామం ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలయంలో దత్తాత్రేయ జననంలో పాల్గొన్న భక్తులు

బాసర: బాసర మండల కేంద్రంలో దత్త పౌర్ణమిని పురష్కరించుకొని వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దత్త మందిరంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేక అర్చన పూజలు నిర్వహించారు. పల్లకిలో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు శోభయాత్ర జరిగింది. భక్తి పాటలు ముత్యాలతో ముందుకు సాగింది. అనంతరం దత్తాత్రేయ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరగగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు కొట్ల(బి) సాయినగర్ తండాలలో గల సాయిబాబా ఆలయాల వద్ద అలాగే ప్యారమూర్‌లో గల దత్త ఆశ్రమములో గురువారం గ్రామ కమిటీల ఆధ్వర్యంలో దత్త జయంతిని నిర్వహించారు. ఈ నేపథ్యంలో దత్త ఆశ్రమంలో వేద పండితులు పూజలు చేసి ఉయ్యాలలో దత్త విగ్రహాన్ని పెట్టి నామకరణం చేశారు. ఈ దత్త ఆశ్రమానికి చుట్టు పక్క గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను మొక్కారు. దత్త జయంతికి వచ్చినటువంటి భక్తులకు ఎలాంటి ఇబ్బందుల ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని చర్యలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భైంసా రూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో గురువారం దత్త జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దత్తాత్రేయుడికి ఉదయం పాలాభిషేకం, కుంకుమార్చలతో అభిషేకం అందించి, ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక మొత్తంలో పూజలు చేసి సుఖ శాంతులతో ఉండాలని కోరారు. దత్తాత్రేయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ మెంబర్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


బాసరలో దత్త జయంతి సందర్భంగా స్వామి వారికి పల్లకి సేవ


వానల్‌పాడ్‌లో..


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామరావు పటేల్

నందన్ గ్రామంలో ఎన్నికల సందడి

- 7న దేవుడి చెరువు జాతర, 14న ఓటర్ల జాతర


నందన్ గ్రామంలో ఓటర్ల సందడి దృశ్యం

నర్సాపూర్(జి), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ (జి) మండలంలోని ఎస్సీ రిజర్వేషన్ ఉన్న నందన్ గ్రామ పంచాయతీలో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరింది. ఒక వైపు ఎన్నికల హడావిడి కొనసాగుతుండగా, మరోవైపు స్థానిక దేవుడి చెరువు జాతర తేదీలు ప్రజల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయి. నందన్ గ్రామంలోని దేవుడి చెరువు జాతరను ఈ నెల డిసెంబరు 7వ తేదీన జరుపుకోవడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జాతర ఉత్సాహం ముగిసిన వెంటనే డిసెంబరు 14వ తేదీన పోలింగ్ జరగనుంది. దీంతో నందన్ గ్రామంలో ఈ నెల మొత్తం దేవుడి జాతర తర్వాతే ఓటర్ల జాతర మొదలవు తుందని స్థానికులు అంటున్నారు.

మహిళా అభ్యర్థుల కోసం బంధువుల ప్రవాహం...

పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థుల విజయం కోసం పట్టణాల్లో స్థిరపడిన బంధువులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో గ్రామానికి చేరుకున్నారు. వీరి రాకతో నందన్ గ్రామంలో ఒక్కసారిగా ఎన్నికల సందడి, మర్యాదలు పెరిగాయి. నందన్ గ్రామస్థులు, నందన్ తాండ గ్రామస్థులు ఎటువైపు మొగ్గు చూపుతారో నసే దానిపైనే అభ్యర్థుల భవితవ్యం ఆధారపడి ఉంది. డిసెంబరు 5, 2025 సాయంత్రం 5 గంటల తర్వాత గుర్తులు కేటాయించబడతాయి. దేవుడి జాతర 7న ముగిసిన తర్వాత ప్రచారం పతాక స్థాయికి చేరుకుని, 14న ఓటర్ల జాతర తో నందన్ గ్రామ తీర్పు వెలువడనుంది.

స్వాగత తోరణం విరాళం

కుంటాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని అందకూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సిద్ధిరాం పాఠశాలకు గురువారం రోజు స్వాగత తోరణాన్ని విరాళంగా అందజేశారు. ఆయన తండ్రి పృథ్వీధర్ స్మారకార్థం రూ.75 వేలు విలువ చేసే స్వాగత తోరణాన్ని ఆయన విధులు నిర్వహిస్తున్న పాఠశాలకే విరాళంగా అందజేయడం తో పలువురు గ్రామస్థులు ఆయనను అభినందించారు.


డప్పు చప్పుళ్లతో సభకు వస్తున్న జనం


సభకు హాజరైన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు


సీఎంకు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ గోడం నగేష్


సభ అనంతరం బయటకు వస్తున్న ప్రజలు

వరాల జల్లు

(5వ పేజీ తరువాయి..)

తీసుకున్న తర్వాత తొలిసారి ఆదిలాబాద్‌జిల్లాకు వచ్చానని, మొదటిసారి దళిత గిరిజన దండోర సభను ఇంద్రవెల్లిలో నిర్వహించామని పేర్కొన్నారు. కొమురంభీం, రాంజీ గోండు స్ఫూర్తితో ఆనాటి ప్రభుత్వం మీద పోరాటాన్ని ప్రకటించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సంతకం ఇంద్రవెల్లి స్థూపాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధి మాదిరిగానే ఆదిలాబాద్‌జిల్లాను దత్తత తీసుకుని నూటికి నూరుశాతం అభివృద్ధిచేసే బాధ్యత తనదని అన్నారు. రాబోయే 2నెలల్లో ప్రత్యేకమైన ప్రణాళికలను రూపొందించి అధికారులతో సమీక్షించి ఇక్కడే సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగ ఉపాధి అవకాశాలు..

తుమ్మిడిహెట్టి వద్ద మళ్లీ ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని సీఎం అన్నారు. మూతబడిన సీసీఐ పరిశ్రమను పునరుద్ధరిస్తే ఉద్యోగ అవకాశాలు మెరుగు పడుతాయని, త్వరలోనే ప్రైవేట్ రంగంలో సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధిఅవకాశాలు కల్పిస్తామన్నారు. ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్, ఇరిగేషన్ అందుబాటులో ఉంటేనే ఆప్రాంత అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

వర్సిటీ ఏర్పాటు చేస్తాం..

ఖమ్మం జిల్లా మాదిరిగా ఆదిలాబాద్‌లో యూనివర్సిటీని ఏర్పా టు చేసే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఇంద్రవెల్లిలో యూనివర్సిటీని ఏర్పాటుచేస్తే బాగుంటుందని దానికి ఇంద్రవెల్లి యూనివర్సిటీ లేదా కొమురంభీం యూనివర్సిటీ అని పేరు పెడితే ఇంకా చాలా బాగుం టుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 3కోట్ల 10లక్షల మందికి సన్నబి య్యాన్ని ఇస్తున్నామన్నారు. ఈ సభలో ఇందులో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లికృష్ణారావు, ఎంపీ గోడంనగేష్, రాష్ట్రమంత్రి గడ్డం వివేక్, ఎమ్మెల్యేలు పాయలశంకర్, వినోద్, వెడ్మబొజ్జు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ సక్సెస్..

(5వ పేజీ తరువాయి..)

చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రోడ్డు మార్గంలో 3.40 నిమిషాలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం 3.43 నిమిషాలకు సభావేదిక పైకి చేరుకున్నారు. మొదట సభా అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడారు. ఆ తర్వాత ఎంపీ గోడం నగేష్, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు, ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్‌రెడ్డి ప్రసంగించారు. ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సభా సక్సెస్ చేసేందుకు పోలీసులు పకడ్బందీ బందోబస్తు ఏర్పాట్లను చేశారు. సభకు తరలివచ్చిన జనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. స్థానిక ఎన్నికల ముందు జిల్లాలో సీఎం పర్యటించడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో జోష్ కనిస్తోంది.

రూ.260 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

(5వ పేజీ తరువాయి..)

18 పోలీస్ క్వార్టర్స్, రూ.2.6 కోట్లతో 3 ఇంటెలిజెన్స్ విభాగం క్వార్టర్స్, రూ.2కోట్లతో భరోసాకేంద్రం ప్రారంభించారు. కొత్తకలెక్టరేట్ సమీపంలో టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిపనులు ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, మంత్రులు ప్రసంగించారు. ఆదిలాబాద్ పట్టణం, నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్య మంత్రి ప్రత్యేక దృష్టి సారించడం పట్ల ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే పాయల్‌శంకర్ ధన్యవాదాలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8లక్షల కోట్ల అప్పులు మిగిలిచినా అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఇవ్వడం విశేషమన్నారు. ప్రజా పాలనలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని అన్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సానుకూలంగా స్పందించడం అభిందనీయంమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ప్రజలు, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తోందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. యువతకు ఇప్పటికే అరవై వేల ఉద్యోగాలు భర్తీ చేసి రానున్న రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇవ్వనున్నామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన అవినీతి, అహంకార పాలన అని, ఇచ్చిన హామీలను మర్చిపోయి బియ్యం మాఫియా, ఇసుక మాఫియాను ప్రోత్సహించారని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంటక స్వామి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పాలన సాగిస్తున్నారని చెప్పారు.

నూతన భవనాన్ని ప్రారంభించిన డీజీపీ


ఉట్నూర్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ

ఉట్నూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన బ్రీఫింగ్‌హాల్ భవనాన్ని గురువారం రాష్ట్ర డీజీపీ బి.శివధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా సిబ్బందికి శిక్షణలు ఇచ్చేందుకు, బందోబస్తు సూచనలుచేసే సమయంలో ఉపయోగపడేలా నిర్మాణం దోహదపడుతుందన్నారు. టీజీఎస్పీ సిబ్బందితో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించి శుభ్రత పాటించాలని సూచించారు. ముఖ్యంగా సిబ్బందికి శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడంలో పూర్తి సౌకర్యాలతో నూతన భవనాన్ని ప్రారంభించామన్నారు. ఉట్నూర్ సబ్ డివిజనల్ పోలీస్ సిబ్బందికి శిక్షణ సమయంలో ఈ భవనం ఎంతగానో ఉపయోగపడనుందన్నారు. పోలీసు అమరవీరుల పేరుతో నిర్మించబడిన బ్యారక్ ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. పోలీసులకు ఎలాంటి సమస్యలున్న పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బ్రీఫింగ్ హాల్‌కు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మల్టీ జోనల్ వన్ ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ఐజీ పీ అండ్ ఎల్ ఎం.రమేష్, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, ఏఎస్పీ అడ్మిన్ పి.మౌనిక, అధికారులు, సీఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల భారీ బందోబస్తు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీసులు పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. మూడంచెలతో భద్రత ఏర్పాటుచేసి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి అనుమతించారు. కలెక్టర్ చౌరస్తా, ఎస్టీయూ భవన్, గాంధీ పార్క్ వద్ద మూడు చోట్ల టికెటింగ్లు ఏర్పాటు చేశారు. ఇతర వాహనాలు ఇటువైపు రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు. మల్టీజోన్ ఐజి చంద్రశేఖర్‌రెడ్డి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తులో 700మంది పోలీసులు నియమించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇదిలా ఉంటే బందోబస్తు ప్రక్రియను ఎఎస్పీలు కాజల్ సింగ్, సురేందర్ రావు, మౌనికలు పర్యవేక్షించి ఎస్పీకి వివరాలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నేరడిగొండ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): బుద్దికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కళ్లెం నరోత్తంరెడ్డి, ఆన్‌రెడ్డి లక్ష్మారెడ్డి, నల్ల నరేష్ రెడ్డి తదితరులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక నా యకులు ఏలేటి రవీందర్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, లవకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయిలింగిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

- ఘనంగా ఆలయ సిల్వర్ జూబ్లీ వారోత్సవాలు
- సాయి నామస్మరణతో మార్మోగిన గ్రామం
- అందరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్


సుదర్శన మహాయజ్ఞాన్ని పూర్ణవతి చేస్తున్న వేద పండితులు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న

తలమడుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామంలో గల సాయిబాబా ఆలయం నిర్మించి 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రిజోగు రామన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథిలకు ఆలయకమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ దేవుడు అందరికీ ఒక్కడేనని, సబ్‌కా మాలిక్ ఏక్‌హై అని సాయిబాబా చెప్పేవారని అన్నారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని కోరారు. గత 25 ఏళ్ల క్రితం గ్రామసుల సహకారంతో దెబ్బడి అశోక్ ప్రోత్సాహంతో గ్రామంలో సాయిబాబా ఆలయం నిర్మించి గ్రామాన్ని సాయిలింగి క్రమంగా పేరు మార్చడం ఎంతో అభినందనీయమన్నారు. సాయిబాబా ఆలయ అభివృద్ధి కోసం అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతం వేద పండితులతో సుదర్శన మహా యజ్ఞాన్ని పూర్ణహృతి చేశారు. సాయంత్రం సాయిబాబా ఉత్సవ విగ్రహాలతో పల్లకి ఊరేగింపు నిర్వహించారు. దీంతో గ్రామం సాయి నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో మాజీ మంత్రి జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దెబ్బడి అశోక్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, నాయకులు తోట ప్రమోద్, జంగాల పోచన్న, రాగి, రామ్ కిషన్, మగ్గిడి ప్రకాష్, కిరణ్ కుమార్, వేద పండితులు కళ్యాణ్ కుమార్, సాయిబాబా, భక్తులు, గ్రామస్తులు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిర్మల్ కలెక్టరేట్‌లో రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్

కలెక్టరేట్‌లో రోశయ్యకు నివాళి

- పాల్గొన్న అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, అధికారులు రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, అంబాజీ, మోహన్ సింగ్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహ రెడ్డి, హార్టికల్చర్ అధికారి రమణ, ఎల్‌డీఎం రామ్ గోపాల్, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు సూ ర్యారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూత్కూర్ గ్రామ పంచాయతీ ఏకగ్రీవం


సింగరి విజయ

దస్తురాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూత్కూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ పదవి ఏకగ్రీవమైంది. సర్పంచ్‌గా సింగరి విజయ ఎన్నికైనట్లు ఎంపీడీవో అరుణ తెలిపారు. దీంతో 13 సర్పంచ్ స్థానాలు ఉండగా, 11 సర్పంచ్ స్థానాలకే ఎన్నికలు జరగనున్నాయి. భూత్కూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవంగా కాగా, ఎస్సీ రిజర్వేషన్ ఉన్న పెర్కపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు కాలేదు. అక్కడ మొత్తం 554 ఓటర్లు ఉండగా, 550 బీసీ, నలుగురు ఎస్టీ ఓటర్లున్నాయి. దీంతో 11 సర్పంచ్ స్థానాలకు 44 మంది పోటీలో ఉన్నారు.

ఎన్నికల నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవు

- పెంబి ఎస్సై హన్మాండ్లు


స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

పెంబి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమాలు పాటించక పోతే కఠిన చర్యలు తప్పవని పెంబి ఎస్సై హన్మాండ్లు తెలిపారు. గురువారం బెల్ట్ షాప్ కోసం మందును తరలి స్తున్న తులసిపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటిక్యాల్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా చేపట్టిన తనిఖీలో అక్రమంగా మందును తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని ఆ యన వద్ద 11 వేల విలువ గల మందును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

స్థానిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని


రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారు లను ఆదేశించారు. గురువారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఉప సర్పంచ్ ఎన్నికల ఎన్నిక పారదర్శకంగా జరపాలన్నారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన నామినేషన్ల ప్రక్రియ, ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యుల వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాల న్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అందరికీ శిక్షణను పూర్తి చేయాలని చెప్పారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులందరూ పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో నామినేషన్ ప్రక్రియకు ఎటువంటి ఇబ్బందులు కలుగలేదని పేర్కొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆర్వో స్టేజ్ 2 జోనల్ అధికారులు వెంటనే పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రోడ్డు మార్గాలను పరిశీలించాలని వివరించారు. నిర్దేశించిన జాబితా ప్రకారం పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయో లేదో చూడాలని చెప్పారు. సిబ్బంది, ఎన్నికల సామాగ్రి తరలింపునకు అనువైన వాహనాలను వెంటనే సమకూర్చాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంక్షేమ శాఖకు సంబంధించి, అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక వారోత్సవాల వాల్‌పోస్టర్లను కలెక్టర్, అధి కారులు కలిసి ఆవిష్కరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి, డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో శంకర్, డీఈవో భోజన్న, డీఆర్డీవో విజయలక్ష్మి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో దత్త జయంతి వేడుకలు


పూజలు చేస్తున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి


సాయిబాబాకు పూజలు చేస్తున్న లక్కాడి జగన్మోహన్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో గురువారం దత్త జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయిబాబా, దత్తాత్రేయుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోసం ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దత్త జయంతిని పురస్కరించుకొని గత 48 గంటలుగా కొనసాగిన సాయినామ సంకీర్తన కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు ముగిసింది. మధ్యాహ్న హారతి అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భూమయ్య, చైర్మన్ బురాజ్, సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి, సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, శివ కుమార్, ఈశ్వర్, గంగాధర్, నారాయణ రెడ్డి, కోల శంకర్, ప్రకాష్ గౌడ్, హరి, పరమేశ్వర్, జొన్నల మనోహర్, పాతర్ల శ్రీనివాస్, రేఖ, రుక్మిణి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో సాయి భక్తులు పాల్గొన్నారు.

గండి రామన్న సాయిబాబా ఆలయంలో

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గురువారం రాత్రి పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో జడ్పీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, ప్ర ముఖ కాంట్రాక్టర్ సాయి దీక్ష సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కుభీర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలని ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో ఏర్పాటు చేసిన నామినేషన్ క్లస్టర్లను ఆయన పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలను ముగ్గురిని తప్ప నాలుగో వ్యక్తికి అనుమతించకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. గడువులోగా నామినేషన్ల స్వీకరణ టోకెన్లు జారీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌సెంటర్‌ను పరిశీలించి జీపీ కార్యదర్శులకు జీపీ సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు.

డీఈఉడ్ పరీక్షకు 88 మంది హాజరు

నిర్మల్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కస్పాయందు జరుగుతున్న డీఈఉడ్ మొదటి సంవత్సరం పరీక్షల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం 97 మంది విద్యార్థులకు గాను 88 మంది విద్యార్థులు హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, నిర్మల్ ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మూడారపు పరమేశ్వర్ సందర్శించారు. పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను సైతం ఏర్పాటు చేశారు. మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

తురాటి గ్రామ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి

- బీసీ మహిళకు సర్పంచ్ పీఠం
- ఏకగ్రీవాలతో పెరిగిన రాజకీయ వేడి

నర్సాపూర్(జి), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తురాటి గ్రామంలో రాజకీయ సందడి నెలకొంది. సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ముగ్గురు మహిళలు పోటీలో ఉన్నారు. మొత్తం ఎనిమిది వార్డుల్లో, ఏడో వార్డు మినహా ఏడు వార్డులు ఏకగ్రీవంగా ముగిశాయి. ఏకగ్రీవంగా పులి ముత్యం (వార్డు-1), ఉప్పాల రత్న (వార్డు-2), ఉప్పాల ముత్తవ్వ (వార్డు-3), దర్శనం శ్రీకాంత్ (వార్డు-4), పందు ముత్తవ్వ (వార్డు-5), గొర్ల ముత్యం (వార్డు-6), పులి సరిత (వార్డు-8)లు ఎన్నికయ్యారు.

ఏడో వార్డులో హోరాహోరీ...

ఏడో వార్డులో మాత్రమే గొర్ల ప్రవీణ్, సార్దు సాయన్న మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ వార్డు విజేత ఉప సర్పంచ్ ఎన్నికలో కీలకమైన ఎనిమిదో ఓటు వేయనున్నారు.

ఉప సర్పంచ్ దక్కేదెవరికో?

ఏడుగురు ఏకగ్రీవ సభ్యులు, ఏడో వార్డు విజేత ఓటుతో ఉప సర్పంచ్ ఎన్నిక జరగనుంది. ఏకగ్రీవ సభ్యుల ఓట్లు చీలితే ఏడో వార్డు విజేతే కింగ్ మేకర్ కావడం ఖాయం. ఉప సర్పంచ్ పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠలో తురాటి ప్రజలు ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


ఖానాపూర్‌లో భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ బృందం

ఖానాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయానికి సంబంధించిన భూమి లో అభివృద్ధి పనులను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొక్కుల ప్రదీప్ తెలిపారు. గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన భూమి అన్యాక్రాంతం కాకుండా ఆ భూమిలో షెడ్డు, ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజురా సత్యం, అంకం రాజేందర్, మాజీ జడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్, ఆలయ కమిటీ బృందం బీసీ రాజన్న, కొత్తపెల్లి సురేష్, కరిపే శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన


భైంసాలో సీఎం దిష్టిబొమ్మతో నిరసన నిర్వహిస్తున్న హిందువాహిని శ్రేణులు

భైంసా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను హేళన చేసేలా, హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలను చేయడాన్ని నిరసిస్తూ గురువారం భైంసాలో హిందు వాహిని శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. రాత్రి వేళలో యువ వాహిని రాష్ట్ర ప్రతినిధి చింతపండు మహేష్, భైంసా నగర హిందువాహిని అధ్యక్షుడు బాజనొల్లవినాయక్ నేతృత్వంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. స్థానిక శివాజీ చౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యువవాహిని, హిందూవాహిని ప్రతినిదులు చింతపండు మహేష్, వినాయక్‌లు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ అవసరాల కోసం, ఇతర మతాల మెప్పు కోసం హిందూ దేవుళ్లను హేళన చేసేలా మాట్లాడటం సరికాదన్నారు. అనుచిత వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలు దెబ్బతీసారని విమర్శించారు.



పంచాయతీ ఎన్నికల్లో చక్రం తిప్పుతున్న నాయకులు

పార్టీల మద్దతు కోసం ప్రయత్నాలు

రచ్చబండ ముచ్చట్లు

ఉట్నూర్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):గ్రామప్రథమ పౌరుడి ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతము అయినప్పటికి అభ్యర్థుల ఎంపికలో ప్రముఖ పార్టీల నాయకులు చక్రం తిప్పుతున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు నాయకుల మద్దతు కోరుతున్నారు.ఫలితంగా రాజకీయ పార్టీల కార్యకర్తలలో, నాయకులలో ప్రముఖపార్టీల మద్ధతు కోసం ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు. ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కోసం అధికార పార్టీకి చెందిన నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన బీఆర్ఎస్,బీజేపీ కార్యకర్తల మధ్య తీవ్రపోటీ నెలకొంది.ఫలితంగా గ్రామపంచాయతీ ఎన్నికలు ఆయాపార్టీల ప్రముఖులకు తలనొప్పిగా మారాయి.శాసనసభ స్థానాలకు పోటీచేసే అవకాశాలు ఉన్నాయంటూ మొన్నమొన్నటి వరకు శాసనసభ టికెట్ల కోసం పోటీపడ్డ నాయకులు సైతం జీపీల సర్పంచ్‌ల పదవులపై దృష్టి కేంద్రీకరించారు.రాబోయే శాసనసభ ఎన్నికల్లో సైతం తమకు టికెట్లు రావన్న భావనతో వచ్చిన పదవిసరే అన్నట్టు సర్దుకు పోయే మనస్తత్వంతో కొందరు సర్పంచ్ స్థానాలకు పోటీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఉట్నూర్ మేజర్‌గ్రామపంచాయతీ సర్పంచ్‌పదవి మహిళలకు రిజర్వు చేయడంతో దీనికోసం బీఆర్ఎస్‌కు చెం దిన మాజీజడ్పీటీసీ సభ్యురాలు చారులతరాథోడ్ ఇప్పటికే నామినేషన్ వేయగా మరో నాయకుడు సైతం వారి అమ్మను పోటీలో దింపాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. అధికార పార్టీకి చెందిన కొంత మంది కార్యకర్తలు ఇప్పటికే సర్పంచ్ స్థానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.ఒక ఉపాధ్యాయుడి కోడ లును రంగంలో దింపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నాయి. బీజేపీకి చెందిన రాష్ట్ర మహిళ నాయకురాలు జాదవ్‌సుమన్‌బాయి సైతం నామినేషన్ వేసినప్పటికి మండల బీజేపీ నాయకులు, జిల్లా నాయకులు ఇదే పంచాయతీలోని కొమ్ముగూడెంకు చెందిన బానోతు సంగీతతో నామినేషన్ వేయించారు. ఇప్పటికే బీఆర్ఎస్,ఖానాపూర్ నియోజక వర్గం ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్ అనుచరులు మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల స్థానాల కోసం పోటీ పడుతుండగా బీజేపీ నాయకులు సైతం పోటీ పడుతున్నారు. ఖానాపూర్ శాసనసభ్యులు బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో అభ్యర్థులను ఖరారు చేస్తుండడంతో అభ్యర్థులలో సైతం భారీపోటీ నెలకొంది.ఏదిఏమైనాఉట్నూర్ మండలంలోని 38 గ్రామపంచాయతీలలో రాయిసెంటర్ల ఆధ్వర్యంలో కొన్ని గ్రామ పంచాయతీలకు ఏకగ్రీవ ఎన్నికల ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఇప్పటికే మండలంలోని గంగాపూర్, బాబాపూర్, కామాయిపేట్,నర్సాపూర్ తండా తదితర పంచాయతీల సర్పంచ్‌లు,వార్డు సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవం చేస్తున్నట్లు ఆయా గ్రామాల పటేళ్ల, ప్రజలు తీర్మానించారు.



ఇ'స్మార్ట్' ప్రచారం

- రాత లేదు.. మోత లేదు
- సామాజిక మాధ్యమం ద్వారా ఓటర్లకు ప్రచారం

ఇచ్చోడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నికలంటే బరిలో నిలబడే వ్యక్తి తన ప్రచారాన్ని గోడ మీద రాతలతో మొదలెట్టించే వాడు. మైకు మోతాలతో ఆటోలు, సైకిళ్ల ద్వారా ఊరంతా తిరిగి ప్రచారం చేసే వారు. కాలం మారింది. కాలనుగుణంగా మార్పులు సంభవిస్తున్నాయి. నామపత్రాలు దాఖలు తర్వాత తనకు ఎన్నికల సంఘం ఇచ్చిన గుర్తుతో సైకిల్, ఆటో, నాలుగు చక్రాల వాహనాలకు పోస్టర్లు, ఓ మైకు పెట్టి ఊరంతా ప్రచారం కోసం తిప్పే వారు. కాలం మారింది. పల్లెపోరులో సామాజిక మాధ్యమాలు ప్రస్తుతం కీలక భూమిక పోషిస్తున్నాయి. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఏకంగా సామాజిక మాధ్యమాలకు ఇన్‌చార్జీలను నియమిస్తున్నారు.

నేటి నుంచి బోర్ల కుంట జాతర



దావల్ మాలిక్ బాబాదర్

భీంపూర్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలం పిప్పల్ కోటి, నిపాని, గొల్లగాడ్, తాంసి(కే) శివారు ప్రాంతంలో ఉన్న బోర్ల కుంట దావల్ మాలిక్ బాబా జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నది ఏడవ తేదీ వరకు కొనసాగే ఈ జాతరకు జిల్లా , మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. దావల్ మాలిక్ బాబాకు కిచిడీ మలిదలు సమర్పిస్తారు, మొక్కులు తీర్చుకుంటారు కాగా ఈప్రాంతంలోని రైతులు ఇక్కడ విత్తనాలు సమర్పించిన తరువాతనే వానకాలం సాగు ప్రారంభిస్తారు. ఆ తర్వాత పంటలు పండిన తరువాత ధవళ మాలిక్ వద్ద కొంత సమర్పించిన తరువాతనే ఇంటికి తీసుకు వెళ్తారు.తరాల నుంచి ఇది ఆనవాయితీగా వస్తుంది.

నేరడిగొండలో ఘనంగా టీబీ ముక్త్ భారత్

- 170 మందికి ఎక్స్‌రే పరీక్షలు



ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నేరడిగొండ,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమికఆరోగ్యకేంద్రంలో (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో గురువారం టీబీముక్త్ భారత్ (క్షయరహితభారత్) కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వ హించారు. ఈసందర్భంగా నాన్ - పివిటిజి ప్రాంత ప్రజలకు క్షయ వ్యాధిపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా దాదాపు 170 మందికి ఛాతీ ఎక్స్‌రే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సద్దాం మరియు జిల్లా కోఆర్డి నేటర్ సుదర్శన్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రెండు వారాల కంటే ఎక్కువ దగ్గు,సాయంత్రం వేళజ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా మందులు, చికిత్స అందిస్తోందని తెలిపారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, స్వర్ణలత, ఎస్‌టిఎస్ సుధా, ఎక్స్‌రే టెక్నీషియన్ శ్రీనివాస్,ఆశాకార్యకర్తలు మరియు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు తరలిన నాయకులు



సీఎం సభకు మండలం నుంచి తరలి వెళ్తున్న కార్యకర్తలు, నాయకులు

తలమడుగు/భైంసా డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయోత్సవ సభకు సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో తలమడుగు మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. అదేవిధంగా త్వరలో జరగబోతున్న గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లోకాంగ్రెస్ పార్టీ బల పరిచిన అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలం నుంచి బాధ్యతలు కార్యకర్త తరలి వెళ్లారు.

ప్రజాపాలన విజయోత్సవాలకు ముథోల్ కాంగ్రెస్ శ్రేణులు

ఉమ్మడి జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌లో గురువారం జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న ఈ సంబరాలకు ముథోల్ మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావ్ పాటిల్, విఠల్‌రెడ్డి నేతృత్వంలోని పార్టీ శ్రేణులు అధికంగా తరలివెళ్లాయి, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ప్రజాపాలన విజయోత్సవ సంబరాల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పార్టీ శ్రేణులను అధికంగా సమీకరించి తరలించారు.గ్రామపంచాయతీ ఎన్నికలు రసవత్తర స్థాయికి చేరుకున్న తరుణంలో ప్రజాపాలన విజయోత్సవ సంబరాల ద్వారా పార్టీ శ్రేణులను కాంగ్రెస్ ఆదినాయకులు కార్యోన్ముఖులుగా చేసే దిశగా చర్యలు చేపట్టారు.



ప్రజాపాలన విజయోత్సవాలకు తరలుతున్న ముథోల్ కాంగ్రెస్ శ్రేణులు

సమస్యలు విన్నవిస్తామంటే బైండోవరా ?



మాట్లాడుతున్న గండ్రత్ రమేష్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సాత్నాల మండలంలోని రామాయి గ్రామ శివారులో స్థాపించబోయే రేణుక సిమెంట్ ప్రైవేట్ పరిశ్రమలో భూములు కోల్పోయే భూనిర్వాసితుల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యపై వినతి పత్రం ఇచ్చి తమ కష్టాల గురించి వివరించుకుంటామంటే పోలీసు అధికారులు ముందస్తు అరెస్టులో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారని యాపల్‌గూడ మాజీ ఎంపీపీ గండ్రత్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రైతులు తమ భూములను తక్కువ ధరకే ఇవ్వాలని తమపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, రైతులకు భూమి ముఖ్యమని తమ భూమి పోతే ఆ భూమికి బదులుగా భూమిని ఇవ్వాలని లేదంటే తమ భూమికి సరైన నష్టపరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించాలని అనుకున్నామని కానీ, ఒకపక్క ప్రజా పాలన ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటూనే పోలీసు వారిని అడ్డం పెట్టుకొని ప్రజల గొంతు నొక్కుతు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అన్నారు.

ఇరుకుగా మారిన రోడ్లు.. ఇబ్బందిగా ప్రయాణం



మరలపల్లి రోడ్డు వద్ద వాహనాలతో ట్రాఫిక్ జామ్

బోథ్,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):ఒకప్పుడు విశాలంగా ఉన్న పట్టణ రోడ్లు ప్రస్తుతం ఇరుకుగా మారాయి. వ్యాపార వర్గాల వారు తమ వ్యాపారాలను రోజు రోజుకు విస్తరిస్తూ పోతుండడంతో రోడ్లపై తమ వ్యాపారాలను చేస్తూ ఉండడంతో వ్యాపార సముదాయాల ముందు వాహనాలను నిల్పడంతో ప్రతీరోజు ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతున్నది.

మూల మలుపుల వద్ద ఇబ్బంది

మండల కేంద్రంలోని మూలమలుపుల వద్ద మరలపల్లి రూట్‌లో వాహనాలు నడపడం కష్టంగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే రోడ్ల పై ప్రయాణించడం ద్విచక్ర వాహనాల వారికి ఇబ్బందిగా మారింది. రోడ్ల ప వాహనాలు ఉండడంతో ద్విచక్ర వాహనాల వారు తీరా ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు రూట్లో మర్లపెల్లికి వెళ్లే బస్సు డ్రైవర్ సైతం బస్సు నడిపేందుకు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ఎటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని వాహనాల దారులు అంటున్నారు.

అధిక లోడుతో భారీ వాహనాలు

మరలపెల్లి గ్రామానికి వెళ్లాలంటే పట్టణం నడిబొడ్డు నుంచి రోడ్డు ఉండడంతో ఈ రోడ్డు పైభారీ వాహనాలు ముఖ్యంగా అధిక లోడుతో టిప్పర్లువెళ్తున్నాడంతో వాహనాల వారు ఇబ్బందులు పడుతున్నారు. టిప్పర్ల నిండా కంకర మొరం నింపుకొని వెళ్తుండడంతో ఎక్కడ ద్విచక్ర వాహనాలపై పడుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్త పరుస్తున్నారు.

కలాం ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో

ముథోల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి స్వర్గీయ డాక్టర్ అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ముథోల్ ఎంఈవో రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో గురువారం లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు విద్యార్థి దశ నుంచి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. స్వర్గీయ డాక్టర్ అబ్దుల్ కలాం, సుదర్శన చార్యులు స్థాపించిన లీడ్ ఇండియా ఫౌండేషన్ కార్యక్రమంలో భాగంగా లీడ్ ఇండియా స్టేట్ ట్రైనింగ్ మేనేజర్ శ్రీనివాస ఆచార్య, ట్రైనర్లు విజయ్ కుమార్‌లు మాట్లాడుతూ... విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి సంస్కారం, తల్లిదండ్రులు, గురువుల పట్ల ఎలాంటి భక్తి ప్రపత్తులు కలిగి ఉండాలని లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలనే విషయాలను విపులంగా వివరిస్తున్నట్లు తెలిపారు. 2047 వరకు అనగా స్వతంత్ర్యం సాధించి 100 సంవత్సరాలు పూర్తయ్యే సరికి సాంకేతికంగా దేశాన్ని విశ్వగురు భారత్‌గా నిలబెట్టాలన్న అబ్దుల్ కలాం ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ... విద్యార్థుల పరివర్తన వికాసానికి కృషి చేస్తే విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని, ఆశయ సాధనకు కావలసిన సామర్థ్యాలను, దేశభక్తి, సంస్కృతి సంప్రదాయాలను పెంపొందించుటకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం రెండు రోజులు ఉంటుందని తెలిపారు. అబ్దుల్ కలాంరాసిన ఆప్ బడావో దేవ్ బడావో అనే సూక్తి ఆధారంగా ఇది నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ట్రైనర్ పి. విజయ్ కుమార్, ఎం. చిరంజీవి, పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, యాజమాన్యం భీమ్ రావు దేశాయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

కుభీర్‌లో 11 గంటల రాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ



చొండి క్లస్టర్ కేంద్రంలో నామినేషన్ ఇచ్చేందుకు కూర్చున్న అభ్యర్థులు

భైంసా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల చివరి విడత నామినేషన్ల దాఖలు ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. క్లస్టర్ కేంద్రాలకు అధిక సంఖ్యలో అభ్యర్థులు తరలివచ్చి తమ తమ నామినేషన్లను సమర్పిస్తున్నారు. కుభీర్ మండలంలోని చొండి క్లస్టర్ కేంద్రంలో గురువారం రాత్రి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగింది. ఇక్కడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో చొండి, దార్ కుభీర్, జుమ్డా, బెల్గాం, బెల్గాం తాండ గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కోసం క్లస్టర్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడి క్లస్టర్ కేంద్రంలో నామినేషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థులు అధిక సంఖ్యలో ఉండటంతో రాత్రి 11 గంటల వరకు ప్రక్రియ కొనసాగింది. రాత్రి వేళలో అభ్యర్థులు చలిలో వణికిపోతూ తమ తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఇక శుక్రవారంతో చివరి విడత నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్స్ పంపిణీ



విద్యార్థులకు స్టీల్ ప్లేట్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ముథోల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లోని బాలికల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మీడియంకు గురువారం తెలుగు ఉపాధ్యాయురాలు ఆర్. విజయలక్ష్మి విద్యార్థుల కొరకు 100 స్టీల్ ప్లేట్స్‌ను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీత, ఉపాధ్యాయ బృందం కవిత, స్వర్ణలత, గంగాధర్, నీరజ, షాహీదా పర్వీన్, కవిత పాల్గొన్నారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

ఉట్నూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ అడవుల్లో తన కూతురు రజిత (26) భర్త సుదర్శన్ వేధింపుల వల్ల చున్నీతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన అల్లుడుపై చర్యలు తీసుకోవాలని బీర్సాయిపేట మోతీరాం గూడకు చెందిన భూమ్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. భూమ్‌రావ్ కథనం మేరకు లింగాపూర్ మండలం మన్నుగూడకు చెందిన సుదర్శన్‌తో ఐదేళ్ల క్రితం సాంప్రదాయ ప్రకారం వివాహం జరిపించామని, పెళ్లి అయిన 6 నెలల నుంచి తన కూతుర్ని సుదర్శన్ వేధిస్తూ వస్తున్నాడని తెలిపారు. మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడం వల్లనే ప్రతిరోజు తాగి వస్తూ తనకూతుర్ని హింసించేవాడని తెలిపారు. గురువారం అల్లుడు ఫోన్ చేసి కూతుర్ని తీసుకువెళ్లాలని చెప్పడంతో తన కొడుకును పంపించి బైక్‌పై తెస్తుండగా బైక్‌పై నుంచి దూకి తన కూతురు అడవుల్లోకి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిందన్నారు. తన కూతురికి ఒక కొడుకు ఒక కూతురు ఉన్నారన్నారు. ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తాం



బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందచేస్తున్న ట్రస్టు చైర్మన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):వివిధ ప్రమాదాలతో ఆస్తి నష్టాలు, ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ట్రస్టుద్వారా బాసటగా నిలుస్తామని మోహన్‌రావ్ ప్రజా ట్రస్టు చైర్మన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ వెల్లడించారు. గురువారం భైంసా మండలంలోని మాటేగామ్‌లో ఇటీవల విద్యుదాఘాతంతో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో ఇల్లుకాలిపోయి నిరాశ్రాయురాలైన అగ్రే పోసాని కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకొని కుటుంబ స్థితి,గతులను గ్రామస్థులతో మాట్లాడితెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థికసాయం కింద రూ.10 వేలతోపాటు నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ మాట్లాడుతూ ముథోల్ నియోజక వర్గ పరిధిలో ప్రకృతి విపత్తులతో పాటు ప్రమాదాలతో కష్టనష్టాలపాలైన కుటుంబాలకు ట్రస్టు ద్వారా అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని పేర్కొన్నారు.బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో అండదండగా నిలుస్తామని వివరించారు.అగ్ని ప్రమాదాలతో ఇళ్లు కాలిపోయి నిరాశ్రాయులైన బాధితులకు షెడ్లరూపంలో ఇళ్లను నిర్మించి ఆశ్రయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ఇందులో ముథోల్‌మాజీ ఎంపీపీజాదవ్ సుభాష్ పాటిల్, మాటేగావ్ గ్రామ మాజీ సర్పంచ్ శ్యామ్‌రావ్, ప్రతినిధులు శ్రీకాంత్, దేవరావ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

నర్సాపూర్(జి)లో విషాదం

● ఎర్తింగ్ వైర్ తగిలి రెండు గేదెలు మృతి





గేదెల కళేబరాలతో బాధిత రైతులు

నర్సాపూర్(జి),డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో గురువారం జరిగిన ఒక దురదృష్టకర సంఘటనలో రెండు వేర్వేరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్ వైర్ తగలడంతో రైతులకు చెందిన రెండు గేదె అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది. మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం దారిలో, సుధాకర్ తోట వద్ద రోడ్డుకు ఇరువైపులా రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. రోజు మాదిరిగానే పశువుల కాపరి మేత మేపిన తర్వాత సాయంత్రం గేదెల మందతో తిరిగి వస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉన్న ఎర్తింగ్ వైర్లలో లీకేజీ కారణం గానో లేదా అవి తెగి కింద పడటం ద్వారానో విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదం జరిగిందని అన్నారు. ఈ ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన ధర్మోళ్ల భూమేష్, గంగాధర్ అనే ఇద్దరు రైతులకు చెందిన ఒక్కొక్క గేదె చొప్పు మొత్తం రెండు గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. ఘటన జరిగిన వెంటనే రైతు విద్యుత్ శాఖ అధికారులకు, వెటర్నరీ డాక్టర్ కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న వెటర్నరీ డాక్టర్ పశువులకు పంచనామా నిర్వహించి, విద్యుదాఘాతం కారణంగానే మర ణిం చినట్లు నిర్ధారించారు. పభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, రైతులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకో వాలని వారు కోరుతున్నారు.ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ లోపం వల్ల జరిగిన ఈ ప్రమా దంపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి,ఇతర ప్రాంతాల్లోనూ ఎర్తింగ్ వైర్లను తనిఖీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిబూడిదయిన ఇళ్లు, వస్తువులు


దస్తురాబాద్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో గరిపెల్లి రాజన్నకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదానికి గురైంది. వెంటనే అక్కడికి చేరుకున్న గ్రామస్తులు సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, దుస్తులు, ధాన్యం, విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మిగిలిన మంటలను ఆర్పి వేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి తహసీల్దార్ యాదవరావు సుమారు రూ.మూడు లక్షల యాభై వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులను అందజేశారు. ఇందులో సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐ ఆర్థిక, జీపీవో లావణ్య, తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు రవి

సోన్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మద్యానికి బానిసై జీవితం మీద విరక్తి చెంది మండలంలోని గంజాల్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సోన్ ఎస్సై గోపి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గంజాల్ గ్రామానికి చెందిన బందెల రవి(38) అప్పుల బాధతో మద్యానికి బానిసై జీవితం మీద విరక్తి చెంది బుధవారం తన పొలంలో పురుగుల మందు తాగిన గ్రామస్థులు 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయం చికిత్స పొందుతూ చనిపోయాడని, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సోయా, మొక్కజొన్న కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ యార్డులో సోయాబీన్ మొక్కజొన్న పంట నిల్వలు పేరుకుపోవడంతో ఈనెల 5 నుంచి 8 వరకు పంట కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జీ గోలిస్వామి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తిరిగి 9 నుంచి మొక్కజొన్న కొనుగోలు జరుగుతాయని ఈ విషయాన్ని రైతులు గమనించి పంటను మార్కెట్‌కు తీసుకురావద్దని ఈ సందర్భంగా కోరారు.



• సభకు హాజరైన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

వరాల జల్లు

జిల్లాలో ఇంద్రవెల్లి యూనివర్సిటీ..

- త్వరలోనే ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ప్రారంభిస్తాం
- ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్, ఇరిగేషన్ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం
- సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివి
- ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- మంచివాళ్లనే సర్పంచ్‌లుగా ఎన్నుకోండి అవసరమైతే ఏకగ్రీవం చేసుకోండి
- సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- ప్రజాపాలన విజయోత్సవాల సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి


.. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి

ఆదిలాబాద్,డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల పేరిటా నిర్వహించిన బహిరంగ సభకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 260.45 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకుని అభివృద్ధిని సాధిస్తామన్నారు. తల్లిసోనియమ్మ ఆశీర్వదిస్తేనే 60ఏళ్ల తెలంగాణ కల సాధ్యమైందన్నారు. ఉక్కు సంకల్పంతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడిపించేందుకు ముందుకు నడుస్తున్నామన్నారు. సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం, సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు.

ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేస్తాం..

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికలు వచ్చాయని, నోరుమంచిగున్నోళ్లనే సర్పంచ్‌గా గెలిపించుకోవాలని, వీలైతే పంచాయతీలను ఏకగ్రీవంగా చేసుకుంటే బాగుంటుందన్నారు. సర్పంచ్, వార్డుమెంబర్ ఎన్నికలంటూ ఊళ్లో తిరగకుండా పోటీపరీక్షల కోసం సిద్ధంకావాలన్నారు.

ఏడాదిలో ఎయిర్‌పోర్టు..

ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టును నిర్మించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ తన దృష్టికి తీసుకొచ్చారని, వెనుకబడిన ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టును నిర్మిస్తే చాలా పరిశ్రమలు వస్తాయని సీఎం అన్నారు. టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఉన్న పులులను చూసేందుకు దేశంనలుమూలల నుంచి ఎంతో మంది పర్యాటకులు వచ్చేఅవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొంటామన్నారు. ఏడాది తిరిగేలోపే ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తిచేస్తామన్నారు. ఎర్రబస్సు రావడమే కష్టమనే ఆదిలాబాద్‌లో ఎయిర్‌బస్సును దించుతామన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో సమస్యల పరిష్కారం

పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు (మిగతా 6లో..)

రూ.260 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆదిలాబాద్ టౌన్: ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనచేశారు. ముఖ్యమంత్రికి హెలిపాడ్ వద్ద అధికారులు, నేతలు సాదరంగా స్వాగతం పాలికారు. అక్కడి నుంచి నేరుగా సభ జరుగుతున్న ఇందిరాప్రియదర్శిని మైదానం వద్దకు చేరుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్రమంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, గడ్డం వినోద్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ఆయనకు స్వాగతం పాలికారు. అనంతరం పట్టణంలో రూ.260.45 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రూ.18.70 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల సమగ్ర అభివృద్ధి కోసం శంకుస్థాపన చేశారు. రూ.1.75 కోట్ల పెట్టుబడితో ఇందిరా మహిళాశక్తి కింద స్వయం సహాయక మహిళాసంఘాలతో పెట్రోల్ బంక్‌స్థాపన, రూ.19.69 కోట్లతో 160 స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, రూ.200 కోట్లతో పట్టణ పరిధిలో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.2కోట్లతో మహాలక్ష్మి వాడ, విద్యానగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. సంజయ్ నగర్ ప్రాంతంలో రూ.11.93 కోట్లతో (మిగతా 6లో..)



మహిళా స్వయం సహాయక సంఘాలకు చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

సభ సక్సెస్..

- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు
- ముఖ్యమంత్రి పర్యటనతో కాంగ్రెస్‌లో జోష్

ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల పేరిట జిల్లాలో నిర్వహించిన సభ సక్సెస్ అయింది. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు భారీఎత్తున తరలివచ్చారు. సభకు సీఎం రావడం కొంత ఆలస్యమైన జనం ఓపిగ్గా సీఎం ప్రసంగం కోసం ఎదురుచూశారు. మధ్యాహ్నం 3.25గంటలకు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో జిల్లాకు (మిగతా 6లో..)

ఆదివాసీ నాయకుల ముందస్తు అరెస్టులు

ఉట్నూర్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) జిల్లా కేంద్రంలో గురువారం సీఎం పర్యటన సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పెందూర్‌పుష్పరాణి, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పుర్క.బాపురావులను ఉదయం నాలుగు గంటలకు ముందస్తు అరెస్టు చేసి ఉట్నూర్ పోలీసుస్టేషన్‌కి తరలించారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించకుండా ఉండడానికి ముందస్తు అరెస్టులు పూనుకున్నారని తెలుస్తుంది.

రోశయ్యకు ఘన నివాళి


రోశయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించిన కలెక్టర్ రాజర్షిషా, అధికారులు

ఆదిలాబాద్‌టౌన్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ రాజర్షిషా నివాళులర్పించారు. గురువారం స్థానిక పెన్ గంగా భవన్‌లో అదనపు కలెక్టర్ చాంబర్‌లో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఏఓ వర్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో రోశయ్య వర్ధంతిని నిర్వహించారు.


రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలువురు నేతలు


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా

గ్రామ పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌టౌన్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని గురువారం అన్నిజిల్లాల కలెక్టర్లు, అధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, ఉపసర్పంచ్ ఎన్నికల ఎన్నిక పారదర్శంగా జరపాలన్నారు. ఇప్పటివరకు పూర్తిచేసిన నామినేషన్‌ల ప్రక్రియ, ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యుల వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్లు తెలిపారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటుచేశారు. ఆర్వోస్టేజ్-2 జోనల్ అధికారులు వెంటనే పోలింగ్ కేంద్రాలను తనిఖీచేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రోడ్డు మార్గాలను పరిశీలించాలని వివరించారు. నిర్దేశించిన జాబితా ప్రకారం పోలింగ్‌కేంద్రాల్లో అన్నిమౌలిక సదుపాయాలు ఉన్నాయో లేదో చూడాలని తెలిపారు. సిబ్బంది, ఎన్నికల సామగ్రి తరలింపునకు అనువైన వాహనాలను సమకూర్చాలని తెలిపారు. సమావేశంలో అబ్జర్వర్ టి.వెంకన్న, ఎల్.విజయ, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుదత్త జయంతి వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శ్రీ గురుదత్త జయంతి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాల్లో ఉదయం నుంచే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. అందులో భాగంగానే పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవిఆలయంలో దత్తజయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భారీఎత్తున తరలివచ్చిన భక్తుల సమక్షంలో ప్రత్యేకహారతులు అందచేసి వేడుకున్నారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు జరిపి దత్తాత్రేయుడిని కొలిచారు. భక్తులు దత్తాత్రేయుడిని దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో ఆలయానికి రావడంతో ప్రత్యేక శోభ నెలకొంది. మరోవైపు హనుమాన్ నగర్‌లోని శ్రీ గురుదత్త మందిరంలోనూ జన్మోత్సవ కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయుడి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి శోభయత్రను ఉత్సాహంగా జరిపారు. భక్తుల భజన సంకీర్తనల నడుమ పల్లకిఊరేగింపు కన్నుల పండువగా సాగింది. మహిళలు మంగళ హారతులను చేతపట్టుకుని పల్లకీకి ప్రత్యేక పూజలు జరుపుతూ శోభాయాత్రలో పాల్గొన్నారు.

బజార్ హత్నూర్ : మండలకేంద్రంలోని ముత్యంపేట, గిర్నూర్‌లలో గురువారం దత్తజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా దత్తనామస్మరణ, పారాయణ కార్యక్రమాలతోపాటు సప్తాహ కార్యక్రమం కొనసాగింది. చివరిరోజు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకి ఊరేగింపు శోభాయాత్ర సాగింది. ఈ సందర్భంగా బాజాభజంత్రీలతో మహిళలు, భక్తులు నృత్యాలు చేస్తూ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దత్త మందిరంలో అన్నదాన మహా ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జాతర సాగింది. ముత్యంపేటలో దత్త సప్తాహ సందర్భంగా పారాయణంలో నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

రెండోరోజు భారీగా నామినేషన్లు

- తలమడుగులో సర్పంచ్‌కు 45, వార్డుమెంబర్‌కు 107

తలమడుగు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): రెండోరోజు సర్పంచ్, వార్డు మెంబర్లు భారీగా నామినేషన్లు వేశారు. తలమడుగు మండలంలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీచేసేందుకు రెండురోజు 45మంది అభ్యర్థుల దరఖాస్తు చేసుకున్నారని ఎన్నికల రిటర్న్ అధికారి ఎంపీడీవో శంకర్ తెలిపారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలకు ఏడు క్లస్టర్‌గా విభజించి దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో 29 గ్రామపంచాయతీలో గాని 29 సర్పంచ్ అభ్యర్థులు 238 వార్డుల పోటీచేసే అభ్యర్థుల నుంచి వార్డు మెంబర్లు నామినేషన్లు స్వీకరిస్తున్నమన్నారు. రెండోరోజు 45మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, అదేవిధంగా 107మంది వార్డు మెంబర్లు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. రెండోరోజు కూడా రాత్రి వరకు దరఖాస్తు ఫారాలను ఎన్నికల అధికారులు స్వీకరించారు.

నేరడిగొండలో..

నేరడిగొండ: మండలంలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ శేఖర్ మాట్లాడుతూ మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీలకు గాను నామినేషన్ల స్వీకరణ జరుగుతోందని తెలిపారు. రెండో రోజు సాయంత్రం వరకు 35 సర్పంచ్ స్థానాలకు, 73 వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు దాఖలయ్యాయని ఆయన వెల్లడించారు. ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు నామినేషన్లను స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు.

ఎన్నికల విధుల నుంచి గర్భిణీ, దివ్యాంగులను మినహాయించాలి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని, గర్భిణులను, దివ్యాంగులను మినహాయించాలని తపస్ నేతలు కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందించారు. అదేవిధంగా స్కావెంజర్ గ్రాంట్‌ను ఎఫ్ఆర్ఎస్ ప్రకారం కాకుండా యూ డైస్ ఎన్‌రోల్‌మెంట్ ప్రకారం విడుదల చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహన్, వలభోజు గోపికృష్ణ, ఉదార్ కేశవ్, కాంబ్లే గోపాల్, తదితరులు ఉన్నారు.

బ్యాలెట్ పత్రాలను పరిశీలించిన అధికారులు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుండగా పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. గురువారం జడ్పీ కార్యాలయంలో పోస్టల్‌బ్యాలట్ పత్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకులు టి.వెంకన్న, వ్యయ పరిశీలకులు విజయతో కలిసి కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీపీవో రమేష్, డీఆర్డీవో రవీందర్, డీఎల్‌పీఓ ఫణిందర్, సిబ్బంది పాల్గొన్నారు.


బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

నేటి నుంచి కైలాస్‌టేకిడి శివాలయం వద్ద జాతర


శివాలయంలో పూజలు చేస్తున్న లింబాజి మహారాజ్

బోథ్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాష్ట్ర సరిహద్దుల్లోని అడవులలో వెలిసిన కైలాస్ టేకిడి పర్వతంపై ఉన్న శివాలయం వద్ద నేటినుంచి జాతర ప్రారంభం కానుంది. దట్టమైన అడవులలో మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఆలయం వద్ద ప్రతియేటా జాతర కొనసాగుతుంది. వేలాది మంది భక్తులు ఈ జాతరలో పాల్గొంటారు. మహారాష్ట్ర తెలంగాణ రాష్ట్రాల్లోని భక్తులు హాజరవుతారు. మూడు రోజుల పాటు కొనసాగుతుంది. జాతర సందర్భంగా భక్తులకు లింబాజి మహారాజ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీవో ఆకస్మిక తనిఖీలు


కూరగాయలు పరిశీలిస్తున్న పీవో యువరాజ్ మర్మాట్


సరుకులు పరిశీలిస్తూ..


అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలిస్తున్న పీవో

ఉట్నూర్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని పీఓ యువరాజ్‌మర్మాట్ అన్నారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని జైనూర్ మండలంలోని రాసీమెట్ట గిరిజన ఆశ్రమ పాఠశాల, భూసిమెట్టలోని గిరిజన గురుకులాన్ని సందర్శించి రిజిస్టర్లు, తరగతి గదులు, ఆశ్రమపాఠశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ విద్యారంగం బలోపేతం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైనవిద్య అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ప్రతీరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థులకు అవసరమన ఐరన్, సీ విటమిన్ టాబ్లెట్లను అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత పొందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వసతిగృహ పరిసరాలలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఉదయం స్నానానికి వేడినీళ్లు ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు జేఈఈ, నీట్‌కు ప్రిపేర్ అయ్యేవారికి సలహాలిచ్చారు. ఆర్ఓ ప్లాంట్ వాటర్ చెక్‌చేసి రిపేర్ చేయాలని సంబంధిత ఏఈని ఆదేశించారు. అలాగే బీసీమెట్ట కళాశాలలో కాంపౌండ్‌వాల్, ఆర్ఓ ప్లాంట్ రిపేర్ చేయాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులున్నారు.